
# మా అత్తగారి లీలలు



శ్రీమతి కె.ఎస్.లక్ష్మి

మా అత్తగారు "ఏడవతారీకు రాత్రి తెనాలిలో 'సర్కార్ ఎక్స్‌ప్రెస్'కి మద్రాసుకి ప్రయాణమవుతున్నారట, కనుక ఎనిమిదవతారీకు ఉదయం స్టేషన్‌కి రమ్మని" ఆ రోజు పోస్టులో మా వారికి ఉత్తరం రావటంతో ముందు ఆయన నెత్తిన పడాల్సిన పిడుగు నా నెత్తిన పడింది. సాయంత్రం వరకు యీ వార్త నెలాగోలా యిముడ్చుకుని, "అయ్యో పాపం! మీ అమ్మగారు వస్తున్నారటగా?" అన్నాను కాస్త పెదమలు సాగదీసి లేనినవ్వు తెచ్చిపెట్టుకున్న ముఖంతో ఆఫీసునుంచి రాగానే.

ఆయనలో యే చలనమూ కలుగలేదుగానీ నాలో మాత్రం చాలా సంచలనం రేపింది ఆ ఉత్తరం.

"పాప మేమిటి నీ ముఖం? నీలాంటివాడు 'అయ్యో పాపం! మీ పెళ్ళిటగా?' అన్నాడుట. అలావుంది. లేకపోతే మా అమ్మ వస్తున్నదని సంతోషించక, ఆ యేడవలేక నవ్వట మేమిట?" అన్నారు.

మా వారుకూడా నా దగ్గర బయటపడితే బాగుండదని అలా అన్నారు కానీ. ఆయనఆముదం త్రాగినట్లు పెట్టిన ముఖం చూస్తే ఆయన బాధ తెలుస్తూనే వున్నది.

"అ పాపం! యిన్నాళ్ళకి ఆవిడొస్తుంటే నాకేం బాధండీ? నా పని మరీ హాయికదా? చక్కగా రెండుపూటలా "మడి" అనే పేరుతో వంటనించీ తప్పుకోవచ్చు. ఇంటి పనంతా ఆవిడే చూసుకుంటారు" అన్నాను.

మొత్తం మీద "బాంబ్‌షెల్"లాంటి ఆ లెటరు మాత్రం నాలుగు రోజులు మాకు మనశ్శాంతి లేకుండా చేసింది.

దీనికంతటికి కారణం యేమీ లేదు. అసలే "ఏడో"తాకీదు బయల్దేరుతున్నారే! ఇక్కడ మమ్మల్ని యేమిఏడిపించుకుతింటారోననిబాధ ఇక ఆవిడ వచ్చిన దగ్గర్నుంచీ పనివాళ్ళు పాలవాళ్ళు 'స్ట్రైయిక్' చేయాల్సిందే. లేకపోతే ఆవిడ సహించలేరు. ఈ మద్రాసు మహానగరంలో, ఆవిడ ఎం సంచలనం లేవదీస్తారో ననేదే మా బాధ.

ఒక్క మాటలో చెప్పాలంటే మా అత్తగారు పెద్ద రివల్యూషనిస్టులెండి. తెనాలి చుట్టుప్రక్కల వూళ్ళకి కూడా గిణపవరపు గంగమ్మగారంటే తెలుసు. ఆవిడ గయ్యాళితనం చూసి చాల సంబంధాలు భయపడి తిరిగిపోయాయి. కానీ మా నాన్నగారు మాత్రం, పిల్లవాడు మద్రాసులో వుంటాడు కదా, ఈవిడ యెలాగూ పాడీ పంట, గొడ్డూ గోదా వదిలి అక్కడ వుండవచ్చిందా అన్న ధైర్యంతో నన్ను యిచ్చారు.

ప్రతి రోజు సాయంత్రం పెందలాడే వంట చేసి గుళ్ళోజరిగే పురాణాలుహరికథలకి వెళ్ళటం ఆవిడ దినచర్యలో ఒక భాగం. సాయంత్రం జరిగే పురాణకాలక్షేపంలో మొదటి సీటు మాఅత్తగారిది. ఇకపోతే అక్కడ వినటానికివచ్చిన బామ్మగార్ల భజనసంఘానికి మా అత్తగారే ప్రెసిడెంట్. తీరా అక్కడ యీ మెంబర్లంతా కలిసి చేసేపని యేమిటయ్యా అంటే పురాణం చెప్పే పురుషోత్తంగారు వచ్చేలోపున పొరుగింటి అత్తా కోడళ్ళ ఉదంతాలు, కరణంగారి కూతురు పాలేరుతో జరిపిన సరసాలు, నాంచారమ్మ గుడిలో తీర్థమేస్తూ ఆచారిగారు ఆడవాళ్ళ చేతులెలా తాక ప్రయత్నించేది శఠగోపురం పెడుతున్నట్లు నటించి తలపై చెయ్యి మెడకి యెలా తగలనిచ్చింది - ఇవీ వాళ్ళ టాపిక్స్. ఒకవేళ మా లాంటి వాళ్ళం యేదన్నా చెప్పినా "చూశారా! అత్తనే యెదిరించి మాట్లాడుతున్నది. పెద్దవాళ్ళంటే యే మాత్రం గౌరవ మర్యాదలు లేవు. చూడగా కాపురం చేసే లక్షణాలు కన్పించటం లేదని కామెంట్స్ అందుకే మేమెవరమూ ఆ భజన సంఘంలో వున్న 15 మంది సభ్యుల జోలికి పోము.

* * *

చిటచివరకు యెలాగైతేనేం, మేము భయపడుతున్నట్లు, ఆవిడ వ్రాసినట్లు 8 వ తేదీ రానే వచ్చింది. ఈ లోపునే నేను పనివాళ్ళకివార్నింగ్స్ యిచ్చాను.

నేను, మావారు, పిల్లలు స్టేషన్‌కి వెళ్ళాము. తీరాచెస్తే రైలు గంట లేటు. నాకుమాత్రం మా అత్తగారు గార్డుతో పేచీ పడటంతో రైలు లేటయిందేమోనని అనుమాన మొచ్చింది. ప్లాట్‌ఫారం మీద అటు యిటు తిరుగుతు ఆ గంటా గడిపాము.

రైలు రాగానే మేమందరము త్రీటైర్ స్లీపర్ దగ్గరికి పరుగెత్తాము. తీరా ఒక కంపార్ట్‌మెంట్ దగ్గర కిటికీలోంచీ కొన్ని దొంతర్ల సామాను మధ్యనించీ తొంగిచూస్తూ "ఒరేయ్ శ్యామా! ఇక్కడున్నాన్రా" అంటూ అరిచారు.

"అమ్మా! నీవుదిగు. సామాను నేను దింపిస్తాను." అన్నారు మావారు. "నేనేం సామాను తెచ్చానో నీకేం తెలుస్తుందిరా, నేను దిగితే, నీవు కూలీని పిలిపించి దింపించేలోపు యెవరైనాదించేసుకుంటారేమో, ఈ మాత్రానికే కూలీలెందుకుగాని నేను అందిస్తాను, నీవుదించు." అన్నారు.

ఈ మాత్రానికే అంటే యే మాత్రం సామానో అనుకున్నాము. ఆవిడ అందిస్తూనే వున్నారు. మా వారు దించుతూనే వున్నారు. సామాను మాత్రం తరగటం లేదు.

ఒక పక్క గుడ్డల మూట, ఒక ట్రంకుపెట్టెలో కట్టుకునే గుడ్డలు, రెండు రంగుపోయిన యినుప డబ్బాలు, దొడ్లో కాసిన గుమ్మడి కాయల గోనె ఒకటి, ఓ యాభై ములక్కాడల కట్ట, యింకా వచ్చళ్ళ బుట్టలు, ఈ రెండు నెలల్లో పాడై పోతా యని అక్కడ మిగిలిన సరుకులు, వాళ్ళకీ, వీళ్ళకీ యివ్వడ మెందుకులే అని ఓ బంగినపల్లి మామిడి పండ్ల బుట్ట, దాహమేస్తే త్రాగేందుకు ఓ మర చెంబు, ఇంకా లోపల యేమున్నాయో తెలియని కొన్ని మూటలు.

ఈ సామానంతా పాపం యెలాగోలా దింపారు మా వారు. ఆఖరున మిగిలిన గుమ్మడి కాయల గోనెని రొప్పుతూ రోస్తూ క్రిందపడేసే సరికి దాని మూతికి కట్టిన తాడు వూడి గుమ్మడి కాయలన్నీ ప్లాట్‌ఫారం మీద దొర్లాయి. అవి పట్టుకురావటాని కని మా అత్తగారు ఒకవైపు, మా వారు మరో వైపు పిల్లలు యింకోవైపు పరుగెత్తారు ఈ దృశ్యం చూసినవారు గుమ్మడికాయలా పరుగెడు తున్న మా అత్తగార్ని వాటినే మార్చిమార్చి చూసి మరీ నవ్వుకుంటున్నారు.

నేను మాత్రం చూస్తూ నిల్చుంటే యేం బాగుం టుందని. నా కాళ్ళని ముద్దుపెట్టుకున్న లేతగుమ్మడి కాయని తీసి గోనెలో వడేశాను.

"కాశీకి వెళ్ళి కొంగపెంట తెచ్చినట్లు మద్రాసు వస్తూ యీ గుమ్మడికాయలు తెచ్చావెందుకు? ఇక్కడ అన్నీ దొరుకుతాయని చెప్పానుకదా?" అంటూ విసుక్కున్నారు మావారు.

"అదికాదురా నాయనా! ఇంట్లో కాసినవాటి రుచి బజారులో దొరికేవాటికెందుకొస్తుంది చెప్పు! ఈ యేడు ఎడం చేత్తో గింజ విసిరేస్తే, యాభై కాయ కాసింది తీగ. ఊరికే రావటమెందుకు! ఏదో వడియాలు అవీ పెట్టుకుంటారని తెచ్చాను" అన్నారు.

"చాల్లేమ్మా! నీది మరీ చాదస్తం. బజార్లో దొరికేవి మాత్రం చెట్లకి కాయక రోడ్లకి కాస్తాయా? ఇంకా నయం ఆ యాభై కాయలూ తేలేదు. ఇంతటితో రక్షించావు" అంటూ కూలీని పిలిచి "తలా రెండు సామాన్లు తీసుకుపోయేదానికి కూలీ లెందుకురా?" అంటున్న మా అత్తగారి మాటలు విన్పించుకోకుండా సామాను బయటకు చేరవేశారు.

నేను మా అత్తగారు వెనుక నడుస్తున్నాము. తెనాలి, చుట్టుప్రక్క పల్లెలు తప్ప చూడని మా అత్తగారు సెంట్రల్ స్టేషన్ చూసి, ఆశ్చర్యంలో నోరు తెరచి అలాగే నిలిచిపోయారు. కళ్ళజోడు పెట్టుకొనటం కూడా మరచిపోయి. ఆవిడలా నడవక నిలిచిపోయే సరికి వెనక వస్తున్న యిద్దరు "హిప్పీలు" (హిప్పీ డ్రెస్‌లో వున్న స్టూడెంట్స్" నూ అత్తగారికి డాష్‌కొట్టి, సారీలు చెప్పి వెళ్ళిపోయారు. మసక మసగ్గా (మా అత్త గారిది చత్వారం లెండి) కన్పించినవాళ్ళు ఆడో మగో తెలియక, ధోవతి కొంగులో కట్టిన కళ్ళ జోడు పెట్టెలోంచి కళ్ళజోడు తీసి, త్వరగా పోతున్న వాళ్ళని కళ్ళజోడులోనించి తేరిపార చూసి "వీళ్ళెవరే అమ్మాయ్? యిలా వున్నారు? ఇంతకీ ఆడో మగో యెలా తెలుస్తుంది నాతల్లీ? పెగా ఆమెళ్ళో వేమిటి నా రుద్రాక్ష మాలల్లా వున్నాయి?" అంటూ ప్రశ్నలు కురి పించారు.

వాళ్ళేదో డాష్‌లు కొట్టటం అలవాటయినట్లు ఒక్క సారీతో పోయారు గానీ, మా అత్తగారు అంత త్వరగా వదిలి పెట్టారా వాళ్ళని. "అయ్యో! అలా గట్టిగా అరవబోకండి వాళ్ళు వింటే తిట్ట గలరు ఇప్పుడిది యిక్కడి ఫ్యాషన్. అమ్మా యిలు జుట్టు కత్తిరించుకుని బెల్‌బాటమ్స్ వేసు కొంటున్నారు. మగపిల్లలు జుట్టు పెంచుతున్నారు. ఇక ఆడో మగో అన్నది పేర్లను బట్టి, నడకను బట్టి పోల్చుతే తెలుసుకో వాల్సిందే ఇక అదయినా అమ్మాయిల్లా నడిచే అబ్బాయిలు అబ్బాయిల్లా నడిచే అమ్మాయిలవుతే అదీ కష్టమే. అయినా వాళ్ళెవరో, ఆడోమగో తెల్సు కోవాల్సిన అవసరం మనకేమిటి గానీ తొందరగా నడవండి. ఆయన వెళ్ళిపోతున్నారు" అంటూ స్టేషన్ బయటికి తీసుకొచ్చాను.

మా వారు అడయారుకి టాక్సీ మాట్లాడి అందర్నీ యెక్కించారు. టాక్సీ 'బీచ్' రోడ్డుమీద నించి 'రంయ్' మని దూసుకుపోతుంటే మా అత్త గారి ప్రాణం గిలగిల్లాడింది. అంత డబ్బు యిచ్చి అంత త్వరగా పోవటం ఆవిడకి నచ్చలేదు.

"ఇదిగో డ్రైవరూ! టాక్సీ మెల్లగా పోనీయ్! నీవు అంత త్వరగా పోనిస్తే నాకేమీ కన్పించటం లేదు. నేను అంత దూరం నించీ వచ్చింది ఏమీ చూడకుండా వెళ్ళటానికా?" అంటూ మొదలు పెట్టారు.

డ్రైవరుకి తెలుగు రాదు. దానికివాడు "ఎన్న సొల్లాంగో అమ్మా"- అంటూ తమిళంలో "వది బాడుగలు తోలుకునే వాళ్ళం మీకు ప్రతిచోట ఆపి అన్నీ చూపిస్తూ వెళితే మాకు పొట్ట గడిచేదెట్లా" అన్నాడు.

"ఏమిటే, సొల్లు, సొల్లు అంటున్నాడు. సొల్లు వెధవ. ఇంత డబ్బు తీసుకుంటూ కొంచెం మెల్లగా పోనియ్ మంటే వాడి సొమ్ము పోయినట్లు యేడుస్తున్నాడు. అయినా యీ రోజులిలా వున్నాయిలే. పనివాళ్ళని పలకరించేలా లేవు." అంటూ ముక్కు మీదికి జారిన కళ్ళజోడు పైకి నెట్టుకున్నారు.

ఎలాగైతేనేం? ఇల్లు చేరాము. మాది అడ యారులో మూడు కుటుంబాలు కలసి వుంటున్న 'జాయింట్ హౌస్' మూడు కాపరాల వాళ్ళకీ దొడ్డి 'కామన్.' దొడ్లో ఒక బావి వాడుక నీళ్ళకి, త్రాగు నీళ్ళకి వేరే కార్పొరేషన్ పంపు వున్నాయి మా అత్తగారు, రోజు పూజ చేసుకునేందుకు వీలుగా దొడ్లో తులసికోట వున్నది. మధ్య వాటాలో మేమున్నాము. ఎడంచేతివాటాలో భార్యా భర్త యిద్దరు పిల్లలు వున్నారు. కుడిచేతివైపు వాటాలో భార్యా భర్తలు, ముగ్గురు పిల్లలు కాక ఆ యింటాయన తమ్ముడు కొడుకులిద్దర్నీ చదువుకు పెట్టుకున్నాడు. వాళ్ళు వుంటున్నారు. మా అత్త గారికి యిక పోలేదంత కాలక్షేపం. స్కూలుకి సెలవ లివ్వటంతో మా చెల్లి, మద్రాసు చూడాలని వచ్చింది. 16 ఏళ్ళు వుంటాయి దానికి.

# సంక్రాంతి

— నాగభైరవ ఆదినారాయణ

సంక్రాంతి పండుగను
చేసుకుంటున్నాను
కన్నుల్లో కాంతిని
నింపుకుంటున్నాను.
మానవత్వం అగ్గితో
హింస అనే పుల్లలను వెలిగించి
దానవత్వం పొగను
దూరం చేస్తున్నాను ॥సంక్రాంతి॥
మమత అనే ముగ్గుతోడ
రంగవల్లికల నల్లి
కాంతి అనే గొబ్బిముద్దలు నెలకొల్పి
అహింసా గీతాలు
ఆలపిస్తున్నాను ॥సంక్రాంతి॥
సమాజం కోళ్ళపందెపు రంగంలో
ధర్మం, న్యాయం, నీతికోళ్ళకు
సత్యమనే కత్తిని కట్టి
అధర్మాన్ని
అన్యాయాన్ని
అవినీతిని
అంత మొందింప
చేస్తున్నాను ॥సంక్రాంతి॥
నవతానూత్న వస్త్రాలతో
అలంకరించుకొని
విజ్ఞానపు గారెల విందారగిస్తూ
పురోగతి మార్గంలో
పయనం సాగిస్తూ ॥సంక్రాంతి॥

ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకల్లా లేచి దొడ్లో బావిదగ్గర పదిహేనుబిందెల నీళ్ళు దడదడమంటూ చేస్తూ పోసుకుని సగం మందిని నిద్రలేపి మిగిలిన వాళ్ళని మేలుకొల్పేందుకన్నట్లుగా, తులసికోట దగ్గర జారగిలబడి మేలుకొలుపులు పాడేవారు.

"తెల్లవారెను కోడికూసెను
దిక్కులన్నియు నిదురలేచెను.
నీదు పూజకు తరలివస్తిని
మేలుకొనవమ్మా
నన్నేలుకొనవమ్మా?"...

మొదటి నాలుగైదు రోజులు యేమీ అనలేక మింగలేక వూరుకున్నారు గానీ ప్రక్కవాటాల వాళ్ళకి యిది కష్టంగానే వున్నది. సరిగా నిదుర

(మిగతా 35 వ పేజీలో)

# మా అత్తగారి లీలలు

22 వ పేజీ తరువాయి

పట్టే వేళకి "మేలుకో మేలుకో" అంటూ ఆరుస్తుంటే పాపం మంచివాళ్ళు కనుక సరిపెట్టుకున్నారు గానీ యెవరూరుకుంటారు?

ఆ యింటాయన (ప్రక్కవాటాలో వుంటున్నవారు) మేనల్లుడు 10 వ క్లాసు చదువుతున్నాడు. పరీక్షలు. పాపం చదువుకుందామని తెల్లవారు ఝామున నాలుగు గంటలకే లేచేవాడు. తీరా నిద్రకళ్ళన పుస్తకం తెరిచే సరికి అతనికి "మేలుకో మేలుకో" అన్న మేలుకొలుపు "నిదుర పో నిదురపో" అన్న జోల పాటలా వినిపించి మళ్ళా పడుకొని నిద్రపోయేవాడు. కానీ చివరకి అతనికీ విసుగన్పించింది. చదువా సాగటంలేదు. పరీక్షలా జరుగుతున్నాయి. ఇక యీవిడ బాధ పడలేక...

"బామ్మగారీ 'పోరుతో'
పరీక్ష కాస్తా గుండు కొట్టెను
పోవ నేటికి తిరుపతికి
ఇక మంగ లెందుకులే
వేరే క్షౌర మెందుకులే"...

అంటూ తమాషాగా పాడేవాడు. అప్పటికి మా అత్తగారు ఆపకపోయే సరికి ఒకరోజు, పాపం యిక వుండబట్టలేక "బామ్మగారూ! మీకు తెల్లవారగానే అందరికీ తెల్లవారిందనుకోవటం పొరపాటు. నాకు పోటీగా మేలుకొలుపులుపాడి మీరు గెలుద్దా మనుకుంటున్నారు. గెలుపు మీదే. మీతో పోటీ పడలేను. కానీ పరీక్షలు. అందులో పెద్ద పరీక్షలు. అందుకని మీరు కొంచెం మెల్లగాపాడి నాకు చదువుకొనే అవకాశ మివ్వండి." అని సవినయంగా అడిగాడు పాపం.

అది అర్థం జేసికుంటే మా అత్తగారి గొప్ప తనమేముంది?

"ఐనా అంత మనోనిశ్చలత లేనివాడివి యేం చదివి యేం ప్యాసు అవుతావోయ్? దేనికైనా యేకాగ్రత వుండాలి. అంత యేకాగ్రత నీకు చదువుమీదే వుంటే నేను యేం పాడినా నీకు వినిపించదు." అని చిన్న నవ్వునవ్వారు 'దెబ్బ కొట్టాను చూశావా?' అన్నట్లు.

దీని ఫలితం తెల్లవారు ఝామున చూతును గదా మా అత్తగారు ఆ కుర్రవాడు దెబ్బలాడు కుంటున్నారు. ఆ క్రితం రోజు మా అత్తగారు "యేకాగ్రత వుండాలి. అని యిచ్చిన "స్పీచ్" అతనికి వళ్ళుమండి ఆవిడకంటే ముందులేచి "ఇన్ ట్రయాంగిల్ ది త్రీ యాంగిల్స్ ఆర్ యీక్వెల్"... అంటూ "త్రికోణం వేసి" పాపం గట్టిగా గడాగడా చదువుతున్నాడుట. అతను అంత గట్టిగా చదువుతున్నందుకే వళ్ళుమండిన మా అత్తగారు ట్రయాంగిల్ అని చదవడంతో అదికుటుంబ నియంత్రణ ట్రయాంగిల్ అనుకొని పైగా తులసి కోట దగ్గర ఆ ట్రయాంగిల్ బొమ్మలు ముగ్గుల్లా అలంకరించేసరికి వళ్ళుమండి "ఈ రోజుల్లో పేరెడు కుంకల దగ్గర్నుంచి యివి కావాల్సి వచ్చాయి. పైగా గవర్నమెంట్‌వాళ్ళకి అంత కంటె బుద్ధిలేదు. ఎక్కడ చూసిన గుట్టు మట్టు లేకుండా ఎర్రబొమ్మలు ఎడ్వర్సుమెంట్లు (ఎడ్వర్ టైజ్‌మెంట్ అన్నదానికి ఆవిడలా అంటారు) పిల్లలొద్దో పిల్లలొద్దో అని. కావాలన్న వాళ్ళకి పుట్టించగలుగుతున్నారా? లేకపోతే పెద్దముండ వున్నదని లేకుండా యీ గోల యేమిటి?" అన్నారుట.

"ఇది యాంగిల్ కాదు బామ్మగారు. లెక్కల్లో ట్రయాంగిల్. యివ్వాళ లెక్కల 'పరీక్ష' అంటూ యింకా బిగ్గరగా చదివాడుట


"వెధవగోల. మేలుకొలుపు పాడుకుండే ఋణం కూడా లేదు పాడుకొంప. బందులు దొడ్డిలా వందమంది చేరారు చుట్టూ" అన్నారుట. దానికి ఆ కొంపె కోణంగి.

"యేకాగ్రత వుండాలి బామ్మగారూ! అప్పుడు రాగాలు తప్పవు" అన్నాడుట. దానితో మా అత్త గారికి కోపంవచ్చి.

"గుడ్డువచ్చి తల్లి వెక్కిరించిందని అరవై యేళ్ళ ముండని నాతో నీకు పరసాలా?" అంటూ పోట్లాడుతున్నారు. అదీగోల ఇద్దరికీ యెలాగోలా నచ్చచెప్పేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది.

* *

ఉదయం లేచినది మొదలు భగవన్నామస్మరణ అంటూ యేదో ఒకటి పాడుతూనే వుంటారు. ఏమాట కామాట, ఆవిడ గొంతుకూడా చక్కగా



సంక్రాంతి ముగ్గు

గొట్టిపాటి లీలావతి,
అనంతపురం.

వుంటుంది.అందులో చిన్నప్పుడు 'హార్మోనియం' నేర్చుకున్నారుట.

మా యింటాయన మేనల్లుడు పెద్దతనుకొంచెం వెకిలిమనిషి. అతని పేరు 'ముద్దుకృష్ణ.' మా చెల్లెలు వచ్చిన దగ్గర్నించీ రోజులు కొడుతూనే ఉన్నాడు. ఆ రోజు కూడా రోజూలాగానే మా అత్తగారు

"ఒంటిగా వుయ్యాలలూగితివా నా ముద్దుకృష్ణా
జంటగా నను బిలువ దగవోయి"...

అంటూ పాడుతున్నారు. అసలే ఆడివాళ్ళు కన్పడితే చూపులు మరల్చుకోలేడు పాపం ముద్దుకృష్ణ పేరుకు తగినట్లు అతను పాపం ఆ పాట వరండాలో నిల్చున్న నేనో మా చెల్లెలో పాడుతున్నామనుకుని ఉయ్యాలబల్లమీద కూర్చుని ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. ఇంతలోకే మా అత్తగారు 'విభూతి' పూసుకుంటూ, నెత్తిన ముసుగు సవరించుకుంటూ రెండో చరణం.

"కంటికంతా జల మయంబై
మింటివరకును యేకరాశై..." అని పాడుకుంటూ వరండాలో కొచ్చేసరికి అతడు పాడింది మా అత్తగారని తెలుసుకుని బెంబేలు పడిపోయి, "జంటగా నను పిలువదగదోయి" అంటూ ప్రక్కనే యెక్కడొచ్చి కూర్చుంటారోనని, బెదురుగొడ్డులా అంతవరకుచూపులు మరల్చుకొనిఅతను,"దభేల్" మని తలుపుమూసి కన్నీరు జలమయమైనంత పని కాగా లోపలికి పరుగు లంకించుకున్నాడు.

* * *

అప్పటికి మా అత్తగారు వచ్చి నెలరోజులు దాటింది. ఆ రోజు "బీచి" కి తీసుకుపోయాము. మా అత్తగారికి బీచి నచ్చింది కానీ సముద్రం నచ్చలేదు.

"బాపట్లలో అలలు తాటి చెట్టంత వస్తాయి. ఇక్కడ పెద్ద అలలే లేవు. అని నోరు చప్పరించారు."

ఇంతలోకే మావారి 'కొలీగ్', అతని భార్య కన్పడితే ఆవిడ నేను మాట్లాడు కుంటున్నామే గానీ, మా అత్తగారి చూపులన్నీ ఆవిడ చుట్ట మీద, స్లీవ్‌లెస్ జాకెట్ మీదే వున్నాయి. ఆవిడ యేం బాణాలు విసురుతారో అని నాకు గుండె దడ దడ కొడుతూనే వున్నది. ఇంతలోకే ఆవిడ అందుకోనే అందుకున్నారు.

"అంతనడినెత్తికి ఆ ముడి అలా ఎలా పెట్టావమ్మా? బస్సుల్లో యెక్కేటప్పుడు చేతులవీ తగుల్తే వూడకుండా వుంటుందా? 'కురూపికైనా కురులే అందం" అని మెచ్చుకున్నారు.

"లేదు మామ్మగారూ! సవరాలు పెట్టాను. ఒకప్పుడు నాకూ పెద్ద జుట్టు వుండేది. కానీ పెళ్ళయ్యాక వూడిపోయింది" అన్నాది అప్పటికి పెళ్ళి చేసుకోటం నేరమైనట్లు.

ఆ తర్వాత నేను ఆమె కాస్సేపు మాట్లాడుతూ నిల్చున్నాము. మా వారు, ఆయన మాట్లాడు కుంటున్నారు. మా అత్తగారు "ఇప్పుడే వస్తానె అమ్మాయ్!" అని వెళ్ళారు.

ఓ అరగంట పోయాక వాళ్ళని సాగనంపి మా అత్తగారు యేం చేస్తున్నారో అని వెదుక్కుంటూ రోడ్డుమీది కొచ్చేసరికి ఒడినిండా "పుటికీ పుటికీ" పూల మొగ్గలు తుంచుతున్నారు. మద్రాసులో అంత చక్కగా బీచి రోడ్డు చుట్టూ పెరిగే పూల మొక్కల్నీ, వాటిపూలనీ, మా అత్తగారిలాంటి వాళ్ళుంటే రెండు రోజుల్లో పూర్తి చేసుండేవారు, దేవుడి పూజ పేరుతో.

మా వారికి విపరీతమైన కోపం వచ్చింది.

"అమ్మా! ఏమిటీ పనులు? నీవింకా యెక్కడి కెళ్ళావో అని వెదుకుతున్నాను. మన వూళ్ళల్లో లాగా యిక్కడ యెవరూ కోయరు. ఇక్కడ యిన్ని వందలమంది జనంవస్తున్నా యీపూలన్నీ చెట్లనిండా విరబూసి యెట్లా వుంటాయోచూడు. ఎవరైనా చూస్తే వున్న పరువు కూడా పోతుంది త్వరగా పోదాం పద." అని బస్సుస్టాపుకేసి న[...]చారు.

"ఏమోరా నాయనా! అవన్నీ నాకేం తెలుసు ఏదో పూలు చక్కగా కన్పిస్తే, రాత్రికి మొగ్గ[...] నీళ్ళలో వేస్తే ఉదయం పూజకు పనికివస్తాయి[...] అని కోశాను." అని చేసిన పనిని సమర్థించు[...]కున్నారు. ఎలాగైతేనేం యిల్లుచేరాం ఆ రాత్రి[...]

* * *

మా అత్తగారు వచ్చి నెలాపదిహేను రో[...] అయింది. యేవేవో సమస్యలు తెచ్చి పెడుతూ వున్నారు. ఇక యిక్కడ యేమీ తోచటంలేద

## వింతలు-విశేషాలు

### 110 లీటర్ల సారా

ప్రతి ఫ్రాన్స్ వాసి ఏడాదికి సగటున 110 లీటర్ల సారా (లేదా 17.3 లీటర్ల ప్యూర్ స్పిరిట్) తాగుతాడట. ఈ విషయంలో ఫ్రాన్స్ ప్రపంచంలో అగ్రస్థానం వహిస్తోందట. లివర్ వ్యాధుల చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరిన వారిలో మూడింట ఒకవంతు మందికి బాగా తాగుడు జబ్బువుందట. 15 శాతం పారిశ్రామిక ప్రమాదాలు తాగుడు మూలంగానే సంభవిస్తున్నాయట. ఇలా ఫ్రాన్సులోని మధ్య వ్యతిరేక జాతీయ కమిటీ తెలియజేస్తోంది. తాగుడు వ్యతిరేక పోరాటంలో ప్రభుత్వం కూడా సహకరించాలని ఆ కమిటీ కోరింది.

### నిలువుగా శవ సమాధి

పశ్చిమ జర్మనీలోని ఒక చిన్నపట్టణంలో శ్మశానం కొరత ఏర్పడిందట. శవాలను పాతిపెట్టడానికి తగినంత చోటు వుండటం లేదట. శవాలను అడ్డంగా పాతిపెట్టే బదులు నిలువుగా పాతి పెట్టమని ఆ ఊరి కౌన్సిలర్ సలహా ఇచ్చాడట. ఈ వార్త పత్రికల్లోకి ఎక్కి కొంచం సంచలనం కలుగజేసిందట. సమాధి పలకమీద వ్రాసే "హియర్ లైస్" బదులు "హియర్ స్టాండ్స్" అని వ్రాయాలని ఓ ఆసామి సలహా ఇచ్చాడట. ఈ విధంగా సలహా ఇవ్వడం ఎంతో అపచారం. ఇలా సలహా యిచ్చిన కౌన్సిలర్‌ను ముందు సజీవంగా నిలువునా పాతేయ్యాలని ఒళ్ళు మండిన ఓ మహిళ వాఖ్యానించిందట।

### ప్రమాదమైన ఇసుక

స్పెయిన్ సమీపంలోని కాస్టాబ్రావ అనే తీర ప్రాంతంలో ప్రజలంతా తమ ఇళ్ళు హోటళ్ళు,భవనాలు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారట. అక్కడి ఇళ్ళల్లో నివశించడం చాలా ప్రమాదం అని ప్రభుత్వం ప్రకటించిందట. ఇంతకీ అసలు విషయం ఏమంటే, భవన నిర్మాణానికి ఉపయోగించిన సిమెంట్‌లో కలిపిన ఇసుకలో పెద్ద మొత్తంలో గంధకం వుందట. ఇది పునాదుల్ని నాశనంచేసి, గోడల్ని బలహీనపరుస్తుందట. ఈ రకం ఇసుకనుపయోగించి కొత్తగా కట్టిన ఓ భవనం వున్నట్టుండి కూలిపోగానే నిపుణులు పరిశీలన జరపగా ఈ విషయం బయట పడిందట.

### ఎలక్ట్రానిక్ హోరోస్కోప్

ముక్కు మొహం తెలియని జోతిష్కుల ద్వారా కాక, ఎంతో అనుభవం వున్న ఓ సంస్థద్వారా అధునాతన పద్ధతిలో మీ జాతకాలు తెల్సుకోవాలంటే న్యూయార్కులోని హ్యూచరోస్కోక్‌ను సంప్రదించండి. మీరు చేయవలసిందల్లా, మీరు పుట్టిన తేదీ, స్థలం, సమయం పంపితే చాలు. ఎలక్ట్రానిక్ కంప్యూటర్ సహాయంతో మీ జాతకం టి 50 పేజీలు తయారుచేసి మరుసటి రోజునే మీకు పంపబడుతుంది. మీకు ఎక్కువ పేజీల రిపోర్టు కావాలంటే ధర ఎక్కువ అవుతుంది. ఎక్కువ పేజీల రిపోర్టు కావాలంటే ఫీజు 20 డాలర్లు అవుతుంది,తక్కువ కావాలంటే 7.50 డాలర్లు అవుతుంది అని "యు. ఎస్. బిజినెస్ వీక్" అన్న పత్రిక తెలియజేస్తోంది. ఆ పైన మీ ఇష్టం.

— వసంత

పురాణాలు, హరికథలు లేకపోయె. పైగా తన తోటి స్నేహితురాండ్రు లేకపోయె. అందుకని ఒక రోజు వుదయమే మొదలు పెట్టారు.

"ఆ తిరుపతి యేదో చూపించు నాయనా! వెళ్ళిపోతాను. గేదె లేమి అల్లాడుతున్నాయో! భజన సంఘం యేం బావురు మంటున్నదో, పాతేరేం పేచీ పెడుతున్నాడో" అని.

"ఇంకో పదిరోజుల్లో వెళ్దాంలే! వీలుచూచుకు సెలవు పెడతానన్నారు మా వారు.

ఈ లోపల మా అత్తగారు, తను అక్కడికి వెళ్ళేసరికి ఆవకాయ అయిపోతుందని యిక్కడే పెట్టి తీసుకెళ్దామని ఊరగాయలు పెట్టారు.

* * *

మా తిరుపతి ప్రయాణం నిశ్చయమయింది. అలవాటు ప్రకారం మా అత్తగారు ఆవిడసంచులు బియ్యం, పప్పులు తిరుపతిలో వండుకునేందుకు గిన్నెలు, ఆవకాయ యింకా చాలాచాలా తయారు చేశారు.

ఆఖరు సారిగా వెళ్ళేరోజు తెల్లవారు ఝామున తులశమ్మ దగ్గర మేలుకొలుపు పాడారు. ఎంత కోపమున్నా రోజూ ఆవిడ చేసే గోలకి విస్తుక్కున్నా, అంతరాంతరాళాల్లో దాగివున్న మాన వత్వం పైకుబికి ప్రక్కవాళ్ళు అయ్యోపాపం! మామ్మగారు వెళ్ళిపోతున్నారే! రేపటినించీ సందడి వుండదు. అని జాలిపడ్డారు.

తీరా మేమందరము బయల్దేరి స్టేషన్‌కి వెళ్ళేసరికి రైలు బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్నది. నేను పిల్లల్ని ఈడ్చుకుంటూ యెదురు వచ్చిన వాళ్ళని నెట్టుకుంటూ పరుగెత్తుతున్నాను. మావారు కూలీవాడితో పరుగుపందెం లంకించుకున్నారు. పాపం మా అత్తగారు ఆవకాయ టిఫెన్, యింకో చేతిలో మరచెంబుతో పరుగెడుతున్నారు ఆదరా బాదరాగా.

పోయేది తిరుపతియేమో విపరీతమైన రష్. మా అత్తగారు ఆవకాయ టిఫెన్‌తో అంతమంది జనాన్ని తోసుకుంటూ రైలుపెట్టె దగ్గరకు వచ్చేసరికి, యీ లోపున అడ్డము వచ్చిన వారందరికీ, ఆడ, మగ, పిల్ల, పెద్ద అన్న బేధంలేకుండా చీరెలకీ, ధోవతులకీ, అన్నిటికీ నూనె అంటుకున్నది. అది చూసిన కొందరు ప్రక్క పెట్టెలకు వెళ్ళిపోయారు ఆవకాయనూనెకి భయపడి.

"ప్రొద్దున్నే స్నానంచేసి బయల్దేరా నాయనా! ఏదో పెద్ద ముండని, నన్ను తాకబోకండి" అంటూ రైలుపెట్టె ఎక్కారు.

"మీకో చిన్న రైలుపెట్టె చేయించుకోండి బామ్మగారు. ఇలా పదిమంది యెక్కే రైలులో మీ ఆవకాయలు సురక్షితంగాను వుంటాయి. మిమ్మల్ని యెవరూ తాకకుండాను వుంటారు." అన్నది చీరెకి కొంచెం యెక్కువ ఆవనూనె అంటిన కోణంగి.

* * *

ఎలాగైతేనేం రైలు తిరుపతి చేరింది. ఎగువ తిరుపతికి వెళ్దామని టాక్సీ మాట్లాడుతున్నారు మా వారు. తీరా పక్కన చూద్దును గదా మాఅత్తగారు లేరు. ఏంచేస్తున్నారో చూద్దామని యిలా ప్రక్క సందులోకి వెళ్ళేసరికి అక్కడ మా అత్తగారు వున్నారు. పక్కనే ఆవు వున్నది. ఆవిడ గడ్డితో చేయి తుడుచుకుంటున్నారు.

"మేము మీ కోసం వెదుకుతుంటే మీరిక్కడకి వచ్చారేంటి" అని అడిగాను.

"ఏమీలేదే అమ్మాయ్! ఎంత స్నానం చేసి వచ్చినా ఆ రైల్లో అడ్డమైన వాళ్ళు తగిలారు. పోయేది దేవుడి దగ్గరకాయె. కొంచెం ఆవు పంచితం, తో 'శుద్ధి' చేసుకుందామని వచ్చాను" అన్నారు.

"ఇంకా నయం" అని ఆమెను టాక్సీ దగ్గరకు తీసుకు వచ్చాను.

టాక్సీయెక్కి పైకి వెళ్ళబోదా మనుకుంటుం డగా "అయ్యో! అమ్మాయ్! ఎంతపని చేశానే! ప్చ! ప్చ!" అన్నారు.

నాగుండె ఝల్లుమన్నది. ఏపనీ చేయలేదం టూనే ఆవిడ యెన్నోపన్లు చేస్తుంటారు. అలాంటిది ఆవిడ నోటితోనే ఆమాట వచ్చేసరికి యేం కొంపలంటుకున్నాయోనని భయపడ్డాను. ఏమిటండీ యేంజరిగింది అని అడిగాను.

"అయ్యో! నా దేవుడి గూట్లో పెట్టిన కళ్ళజోడు తేవటం మరచి పోయానే. తీరాజేసి యిప్పుడు జ్ఞాపకాని కొచ్చింది" అన్నారు.

ఇక మావారి ముఖం చూడాలి. ఏమైనా అంటే బాగుండదని వూరుకున్నారు. "ఇప్పుడెలాగు 'వెంకటేశ్వరా?'" అంటూ రెండు చేతులు నెత్తిన పెట్టుకుని పెట్టెమీద కూలబడ్డారు.

"పర్వాలేదు రా! మరీ అంత కన్పించకుండా లేదులే. దేవుడి విగ్రహం పెద్దది కనుక బాగానే కన్పిస్తుంది" అని అభయ మివ్వటంలో అంత విసుగులోను సంతోషంతో టాక్సీ యెక్కాము.


* * *

పైకి వెళ్ళి మూడు నాలుగు రోజులుండి అన్నీ చూశారు మా అత్తగారికి అంత తృప్తిగా లేదు. అసలే కళ్ళజోడు లేదు. యెలాగోలా దేవుణ్ని కాస్తపరికించి చూసేంతలో వాళ్ళసొమ్ము పోయినట్లు అక్కడున్న పూజార్లు 'పొండి పొండి' అని అరవటం. మొత్తంమీద మరికొన్ని లీలలతో అలివేలు మంగాపురం అవీ దర్శించి మా అత్తగారిని తెనాలి బస్సులో యెక్కించాము.

పసిపిల్ల లాంటి ఆవిడ మన స్తత్వం ఒక్కసారి చికాకు కల్గించినా, ఒక్కోసారి జాలివేస్తుంది. వెళ్ళిపోయే ముందు పిల్లల్ని దగ్గరకు పిలిచి ఒళ్ళంతా తడిమి, "బామ్మను మరచి పోకండిరా నాన్నా! ఈ సారి మీరు వచ్చేసరికి వుంటానో పోతానో! ఇక్కడే వుందామంటే పాడీపంటా లంకంత యిల్లు వుందె" అంటూ కంటతడి పెట్టారు. మా కందరికీ జాలివేసింది. అందుకే పెద్దవాళ్ళు పసిపిల్లలు వొకటంటారు" అనుకొన్నాను బస్సు బయల్దేరింది.

★

## సంక్రాంతి ముగ్గు



—ఆర్. ఆర్. కుమారి, తెనా